ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 22 ఏప్రిల్ 2025



జిల్లా ఇంటర్మీడియట్ అధికారిగా రాధ


బి.రాధ

అనకాపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారిగా బి.రాధను నియమిస్తూ రాష్ట్ర ఇంటర్మీడియట్ డైరెక్టరేట్ నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, విశాఖపట్నం జిల్లా ఒకేషనల్ అధికారిగా (ఎఫ్ఏసీ) బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నెగ్గుతుందా? వీగుతుందా?

ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై వైసీపీ అవిశ్వాస నోటీసు

- నేడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన కమిషనర్
- అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చైర్‌పర్సన్ వర్గీయులు తీవ్రకృషి
- నోటీసులపై సంతకాలు చేసిన వారిలో కొంతమందితో టచ్‌లో..
- చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించడం ఖాయమంటున్న వైసీపీ నేతలు
- పట్టణంలో సర్వత్రా చర్చ.. ఉత్కంఠ




చైర్‌పర్సన్ రమాకుమారి, ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

ఎలమంచిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మునిసిపల్ చైర్‌పర్సన్‌పై వైసీపీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా? వీగుతుందా? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారిపై వైసీపీకి చెందిన 19 మంది కౌన్సిలర్లు గత నెలలో ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుపై మంగళవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరుగనున్నది. అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకుని, రమాకుమారిని పదవి నుంచి దించేయాలని వైసీపీ నేతలు కృతనిశ్చయంతో వుండగా, ఎలాగైనా వీగిపోయేలా చేయడానికి చైర్‌పర్సన్ వర్గీయులు తెరవెనుక వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.

ఎలమంచిలి మునిసిపాలిటీ పాలకవర్గం ఏర్పాటు కోసం నాలుగేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో మొత్తం 25 వార్డులకుగాను 23 వార్డుల్లో వైసీపీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా గెలుపొందారు. ఒక వార్డులో టీడీపీ, మరో వార్డులో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. 5వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన పిల్లా రమాకుమారిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. కాగా గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో రాజకీయ కారణాల దృష్ట్యా చైర్‌పర్సన్ రమాకుమారి, ఆమె సోదరుడైన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. తమ పార్టీ తరఫున గెలిచి, చైర్‌పర్సన్ పదవి పొందని రమాకుమారి బీజేపీలో చేరడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు, ఆమెను పదవీచ్యుతురాలిని చేయాలని నిర్ణయించుకున్నారు. అవిశ్వాస తీర్మానం ద్వారా పదవి నుంచి దించేయడానికి 19 మంది సంతకాలతో కూడిన నోటీసును గత నెల 26వ తేదీన జిల్లా అధికారులతోపాటు మునిసిపల్ కమిషనర్‌కు కూడా అందజేశారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు(కన్నబాబురాజు), ఎంపీపీ బొడెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, ఆర్రెపు నాగ త్రినాథ గుప్తా, పలువురు కౌన్సిలర్లతో కలిసి ఇక్కడ సమావేశం నిర్వహించారు. వైసీపీ అధిష్ఠానం ఆదేశానుసారం రమాకుమారిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించారు. కౌన్సిలర్ల సంతకాల ధ్రువీకరణ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 22వ తేదీన (మంగళవారం) కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రకటించారు.

అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే...

మునిసిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లతోపాటు, ఎక్స్ అఫీషియో సభ్యునిగా వున్న ... మిగతా 8వ పేజీలో

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

సుమారు ఏడేళ్ల తరువాత డీఎస్సీ నోటిఫికేషన్

- అభ్యర్థుల్లో ఆనందం
- మాట నిలబెట్టుకున్నారంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ప్రశంసలు
- 2018లో చివరిసారిగా టీడీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నోటిఫికేషన్
- మళ్లీ ఇప్పుడు...
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో భారీగా పోటీ
- నిరుద్యోగ ఉపాధ్యాయులు సుమారు 35 వేల మంది ఉండవచ్చునని అంచనా



విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):

సుమారు ఏడేళ్ల తరువాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ...ఆ హామీని నెరవేర్చడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే అధికారంలోకి వచ్చిన తరువాత డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేశారు. వెంటనే నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైనప్పటికీ ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన అంశం తెరపైకి రావడంతో కాస్త జాప్యం జరిగింది. ఎట్టకేలకు 16,347 పోస్టులతో ఆదివారం నోటిఫికేషన్ విడుదలైంది.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న తమకు మోక్షం కలిగిందని, భారీగా పోస్టులను ప్రకటించడం వల్ల ఉద్యోగాన్ని పొందేందుకు అవకాశం ఉందని రాజేశ్ అనే అభ్యర్థి పేర్కొన్నాడు. గడిచిన ఎనిమిదేళ్ల నుంచి శిక్షణలోనే ఉన్నానని, నోటిఫికేషన్ కోసం ఎదురుచూసి కళ్లు కాయలు కాశాయని, ఎట్టకేలకు తమ ఆకాంక్షలు నెరవేరే రోజు ఆసన్నమైందని ఆనందాన్ని వ్యక్తంచేశాడు. నిరుద్యోగుల ఇబ్బందులు, కష్టాలను గుర్తించిన ఏకైక సీఎం చంద్రబాబునాయుడు అని, గతంలో కూడా టీడీపీ ప్రభుత్వ హయాం (2018)లోనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని, మళ్లీ ఇప్పుడు ఆయన హయాంలోనే నోటిఫికేషన్ విడుదల చేశారని శాంతి అనే యువతి ఆనందాన్ని వ్యక్తంచేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడం ఆనందంగా ఉందంది. నోటిఫికేషన్‌కు, పరీక్షకు మధ్య కాల వ్యవధి కొంత తక్కువగా ఉందని, అయినప్పటికీ పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఆనందంగా ఉందని పాడేరు ప్రాంతానికి చెందిన కె.నవీన తెలిపారు. తమ ఇబ్బందులను ఈ ప్రభుత్వమైనా గుర్తించినందుకు ఆనందంగా ఉందన్నారు. చదివిన చదువుకు అనుగుణమైన ఉద్యోగాన్ని సాధించలేక ఎన్నో కష్టాలు పడ్డామని, ఇప్పటికి తమ కల నెరవేరే రోజు వచ్చిందని సవర చిట్టెమ్మ అనే అభ్యర్థిని ఆనందాన్ని వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావిడిగా తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారని, అయినా అది ముందుకు సాగలేదని... ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పోస్టుల సంఖ్యను పెంచి కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని అరకులోయ ప్రాంతానికి చెందిన ఎం.బుజ్జిబాబు ఆనందాన్ని వ్యక్తంచేశారు. బీఈడీ పూర్తయి పదేళ్లు అవుతోందని, ఇప్పటివరకూ ఒకే ఒక్క డీఎస్సీ రాశానని, మరోసారి రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని రాజ్యలక్ష్మి అనే అభ్యర్థిని పేర్కొన్నారు. పరీక్షకు సమయం తక్కువగా ఉన్నా అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందని బి.సుధారాణి అనే అభ్యర్థిని తెలిపారు.

వేలాది మంది అభ్యర్థుల కల నెరవేరింది

- మామిడి శ్రీగౌరి, డీఎస్సీ అభ్యర్థిని



2015లో బీఈడీ పూర్తయింది. 2018లో తొలిసారి డీఎస్సీ రాశాను. అప్పటినుంచి...అంటే ఏడేళ్ల నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా. ఇప్పటికైనా ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈసారి పోటీ గట్టిగా ఉంటుంది. అభ్యర్థులు భారీగా ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోస్టుల సంఖ్య మరికాస్త పెంచితే బాగుండేది. ఏదిఏమైనా నోటిఫికేషన్ రాకతో ఉపాధ్యాయ అభ్యర్థులు కల నెరవేరినట్టు అయింది.

ఆరేళ్ల నుంచి ప్రిపేరవుతున్నా

- కె.కాంతారావు, డీఎస్సీ అభ్యర్థి



డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా అని ఆరేళ్ల నుంచి ఎదురుచూస్తున్నా. ఇంటికి దూరంగా రూమ్‌లో ఉంటూ ప్రిపేరవుతున్నా. ప్రతినెలా కనీసం మూడు వేల నుంచి నాలుగు వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎంతో నమ్మకంతో చదివిస్తున్నారు. వారి నమ్మకాన్ని నిజం చేసేందుకు కష్టపడుతున్నా. ఈ తరుణంలో నోటిఫికేషన్ రావడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు.

వేలాది మంది నిరుద్యోగులు

ఉపాధ్యాయ పోస్టుల కోసం పోటీ పడే వారి సంఖ్య రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఉత్తరాంధ్రలో అధికంగా ఉంది. చివరిసారిగా 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ విడుదలైంది. అప్పటి నుంచి నోటిఫికేషన్ లేకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉపాధ్యా పోస్టులకు పోటీపడుతున్నవారు సుమారు 35 వేల నుంచి 40 వేల మంది వరకూ ఉండవచ్చునంటున్నారు.

చినకలవలాపల్లిలో వడ్డీ వ్యాపారి హత్య


జల్లి తాతారావు (ఫైల్ ఫొటో)


తాతారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ నరసింగరావు, క్లూస్ టీమ్

- రాత్రి మేడపై నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తుల దాడి
- తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావంతో మృతి

రాంబిల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకలవలాపల్లిలో వడ్డీ వ్యాపారి ఒకరు హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి మేడపై నిద్రించడానికి వెళ్లిన ఆయన సోమవారం ఉదయం తీవ్ర గాయాలతో రక్తపుమడుగులో పడివున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడి వుంటారని పోలీసు భావిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ నరసింగరావు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

చినకలవలాపల్లికి చెందిన జల్లి తాతారావు (65) స్థానికంగా వడ్డీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. పిల్లలకు గతంలోనే వివాహాలు అయ్యాయి. భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె ప్రస్తుతం రాజమహేంద్రవరంలో వుంటున్నది. ఇక్కడ తాతారావు ఒక్కడే నివాసం వుంటున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంటి మేడపైకి వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో కేబుల్ టీవీ సిబ్బంది కేబుల్ సరిచేసేందుకు తాతారావు ఇంటి మేడపైకి ఎక్కారు. అక్కడ రక్తపుమడుగులో విగతజీవిగా పడివున్న తాతారావును చూసి కుటుంబ సభ్యుకు సమాచారం ... మిగతా 8వ పేజీలో

కళ తప్పిన డెమో స్కూల్

- మునగపాక ప్రాథమిక పాఠశాల-1లో అరకొరగా విద్యార్థులు
- గత ప్రభుత్వంలో పాఠశాలల విలీనానికి ముందు 350 మంది పిల్లలు
- 3, 4, 5 తరగతుల తరలింపుతో పడిపోయిన సంఖ్య
- ఈ ఏడాది 1, 2 తరగతుల్లో 13 మంది విద్యార్థులు!
- ఖాళీగా ఆరు తరగతి గదులు
- నాడు-నేడు పేరుతో ఖర్చు చేసిన రూ.40 లక్షలు వృథా


విద్యార్థులు లేకపోవడంతో తాళాలు వేసిన తరగతి గదులు


రెండో తరగతిలో విద్యార్థులు

మునగపాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):

నూతన విద్యా విధానం పేరుతో గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన ఒకే ఒక్క జీవో.. ప్రాథమిక పాఠశాల విద్యను నిర్వీర్యం చేసింది. ఈ జీవో తీసుకురావడానికి ముందు పాఠశాలల్లో నాడు-నేడు పేరుతో అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులు, ఇతర సదుపాయాల కోసం ఖర్చు చేసిన కోట్లాది రూపాయలు వృథా అయ్యాయి. ఇందుకు మునగపాకలోని ప్రాథమిక పాఠశాల-1 ఒక ఉదాహరణగా చెప్పాలి. వివరాల్లోకి వెళితే...

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పేరుతో 'మన బడి నాడు-నేడు' కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రాథమిక పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి 'డెమో'పేరుతో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో మునగపాకలోని ఒకటో నంబరు ప్రాథమిక పాఠశాల కూడా వుంది. రూ.40 లక్షలు మంజూరు కావడంతో అప్పటికే వున్న భవనాలకు రంగులు వేసి, మరుగుదొడ్లు నిర్మించారు. తరగతి గదుల్లో బెంచీలు సమకూర్చారు. ఈ పనులు జరగకముందు 2019-20 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు వంద మంది విద్యార్థులు వుండేవారు. పనులు పూర్తయిన తరువాత ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను కూడా ఇక్కడ చేర్పడంతో 2020-21 విద్యా సంవత్సరంలో ఏకంగా 350 మందికి పెరిగారు. ఒక్కో తరగతిలో రెండు సెక్షన్లు వుండేవి. విద్యార్థులతో పాఠశాల కళకళలాడింది. అయితే ఈ కళకళ రెండేళ్లు తిరక్కుండానే మాయమైంది. నూతన విద్యావిధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశా లల్లో 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేసింది. దీనిని మునగపాక ప్రాథమిక పాఠశాల-1లో కూడా అమలు చేశారు. సుమారు మూడు వందల మంది విద్యార్థులను ఉన్నత పాఠశాలకు పంపడంతో డెమో స్కూళ కళ తప్పింది. జడ్పీ పాఠశాలకు పంపడం ఇష్టం లేని పలువురు తల్లిదండ్రులు తిరిగి ప్రైవేటు స్కూళ్లలో చేర్పించారు. కొత్తగా ఒకటి, రెండు తరగతుల్లో చేరేవారు తగ్గిపోయారు. ప్రస్తుతం ఒకటో తరగతిలో ముగ్గురు, రెండో ... మిగతా 8వ పేజీలో

పోలీసుల చొరవతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎ.సూర్యకుమారి


వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎ.సూర్యకుమారి

అనకాపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా కట్టడి చేయడంలో మహిళా పోలీసులు కీలక భూమిక పోషించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.సూర్యకుమారి అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐసీడీఎస్, పౌర సరఫరాలు, వన్‌స్టాప్ సెంటర్, పోక్సో చట్టం, షీ బాక్స్‌ల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. పరిశ్రమలు ఉన్నచోట లైంగిక వేధింపులపై ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పోలీసుల ఉమ్మడి ఆధ్వర్యంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మహిళా పోలీసులు క్రియాశీలకంగా వ్యవహరిస్తే బాల్య వివాహాలను పూర్తిగా కట్టడి చేసే అవకాశం ఉందన్నారు. అన్ని శాఖల హెచ్ఓడీలు డ్యాష్‌బోర్డులో సంబంధిత శాఖల డేటా ఎంట్రీ నిరంతర ప్రక్రియగా సాగేలా చూడాలన్నారు. ఐసీడీఎస్ పరిధిలోని అన్ని విభాగాల పనితీరును అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, నోడల్ అధికారి సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భళా ఈపీడీసీఎల్!

విద్యుత్ పొదుపునకు... స్వయం సమృద్ధికి నమూనాగా సూపర్ ఈసీబీసీ భవనం


నిర్మాణానికి ఉపయోగించిన ఏసీసీ ఇటుకలు

- ప్రమాణాల మేరకు అధునాతన నిర్మాణం
- స్టార్ హోటల్‌కు రెండు అంతస్థులు లీజు

పూర్తయిన ఈసీబీసీ భవనం




ఏసీసీ ఇటుకల మధ్య పెట్టిన డీలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విద్యుత్ పంపిణీ సంస్థే విద్యుత్ ఆదాపై దృష్టి పెడితే ఎలా ఉంటుంది?...అది అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. మార్గదర్శకంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) అదే పనిచేసింది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు విస్తరించిన ఈ సంస్థ ఉద్యోగుల శిక్షణ కోసం అధునాతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

పగలు విద్యుద్దీపాల అవసరం లేకుండా, ఏసీ వినియోగానికి తక్కువ విద్యుత్ అయ్యేలా మొత్తంగా చూసుకుంటే 50 శాతం విద్యుత్ ఆదా జరిగేలా భవనం నిర్మించింది. దీనికి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) నిబంధనలను అనుసరించింది. వారు సూచించిన విధంగా సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)తో భవనం నిర్మించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.5 కోట్లు గ్రాంటు వచ్చింది. ఈ నిధులు వెనక్కి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇంకో రూ.8.5 కోట్లు వెచ్చించి మొత్తం రూ.13.5 కోట్లతో గ్రౌండ్+రెండు ... మిగతా 8వ పేజీలో

స్వయం సమృద్ధి మోడల్

- పృథ్వీ తేజ్, సీఎండీ, ఈపీడీసీఎల్



ఈ భవనం పూర్తిగా స్వయం సమృద్ధి మోడల్‌లో నడుస్తుంది. భవనం నిర్వహణకు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. తిరిగి ఆదాయం రూ.కోట్లలో వస్తుంది. ఈసీబీసీలో సోలార్ పవర్ తప్పనిసరి కావడంతో 15 కేవీ సోలార్ ప్లాంటు పెట్టాం. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు ఇది నమూనాగా నిలుస్తుంది.

పంచాయతీ స్థలాల్లో వ్యాపారాలు

» చిత్రమందిర్ ఎదురు వీధిలో ఐరన్ నిల్వలు » మెయిన్‌రోడ్డును ఆనుకుని నామమాత్రపు అద్దెతో తూరల వ్యాపారం » పట్టించుకోని పంచాయతీ అధికారులు


చిత్రమందిర్ ఎదురు వీధిలో పంచాయతీ ఖాళీ స్థలంలో పాత ఐరన్ నిల్వలు


కాలేజీ గ్రౌండ్ ఎదుట పంచాయతీ స్థలంలో తూరల వ్యాపారం

పాయకరావుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు పంచాయతీ ఖాళీ స్థలాలను కొంతమంది ఆక్రమించి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. చిత్రమందిర్ థియేటర్ ఎదురువీధిలో ఉన్న పంచాయతీ స్థలంలో పలువురు వ్యాపారులు పాత ఇనుము సామాన్లను నిల్వ ఉంచి కొన్నేళ్లుగా వ్యాపారం సాగిస్తున్నారు. అలాగే మెయిన్ రోడ్డులో 300 గజాల స్థలంలో తూరల వ్యాపారం నామమాత్రం అద్దెతో సాగిస్తున్నారు. అయినా పంచాయతీ పాలకులుగానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాయకరావుపేట పంచాయతీకి ఆనుకొని తుని పట్టణం ఉంది. తుని గ్రేడ్-1 మునిసిపాలిటీ కావడంతో పక్కనే ఉన్న పాయకరావుపేట వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతోంది. పంచాయతీ అయినప్పటికీ అన్ని రకాల వ్యాపారాలు, మల్టీ షాపింగ్ మాల్స్ ఏర్పాటవుతున్నాయి. దీంతో పట్టణంలోని ఖాళీ స్థలాలకు డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న పలు ప్రైవేటు ఖాళీ స్థలాలను వేలకు వేలు అద్దెకు తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. స్థానిక చిత్రమందిర్ థియేటర్ ఎదురు వీధిలో ఉన్న ఖాళీ స్థలాన్ని పంచాయతీ డంపింగ్ యార్డుగా ఉపయోగించేది. అయితే పట్టణం విస్తరించడంతో ఆ స్థలాన్ని ఖాళీగా వదిలేసి వేరే చోట డంపింగ్ యార్డును ఏర్పాటు చేసింది. ఈ స్థలం ఖాళీగా ఉండడంతో కొంతమంది వ్యాపారులు పాత ఇనుము సామాన్లు నిల్వకు ఉపయోగిస్తున్నారు. ఏళ్ల తరబడి నిల్వ చేస్తున్నా పంచాయతీ పాలకులుగానీ, అధికారులు గానీ పట్టించుకోలేదు. వారి వద్ద నుంచి రూపాయి కూడా అద్దె వసూలు చేయడం లేదు. అదేవిధంగా పట్టణంలో జూనియర్ కళాశాల గ్రౌండ్ ఎదుట మెయిన్‌రోడ్డుని ఆనుకుని 300 గజాల పంచాయతీ స్థలం ఉంది. ఈ స్థలంలో తూరం వ్యాపారం చేస్తున్న వ్యక్తి పంచాయతీకి ఏడాదికి కేవలం రూ.10వేలు మాత్రమే అద్దె చెల్లిస్తున్నారు. అదే మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న పలు ప్రైవేటు ఖాళీ స్థలాలకు నెల నెలా వేలకు వేలు అద్దె కడుతుంటే కళాశాల గ్రౌండ్ ఎదుట పంచాయతీ స్థలానికి ఏడాదికి రూ.10 వేలు చెల్లించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ స్థలాన్ని తూరల వ్యాపారం చేసే వ్యక్తి ఇప్పుడు వేరే వ్యక్తికి అధిక మొత్తానికి అద్దెకు ఇచ్చారని వారంటున్నారు. పంచాయతీకి తక్కువ అద్దె చెల్లించి, ఇతరులకు అధిక మొత్తంలో అద్దె వసూలు చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోందని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, పంచాయతీ ఖాళీ స్థలాలకు మార్కెట్ రేటుకు అనుగుణంగా అద్దె నిర్ణయించి, పంచాయతీకి అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి

» టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు

పాయకరావుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న టీడీపీ సంస్థాగత ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. సోమవారం పట్టణ పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతోపాటు గ్రామస్థాయి పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న సంస్థాగత ఎన్నికల్లో గ్రామస్థాయి, బూత్ కమిటీలతోపాటు మండల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు కష్టపడే వారినే ఎన్నుకునేలా పార్టీ శ్రేణులు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, యాళ్ల వరహాలబాబు, చిక్కాల శ్రీను, పల్లా విలయంకేరి, మలిపెద్ది వెంకటరమణ, రావాడ గోవిందరెడ్డి, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా కంప్యూటర్ల వితరణ

» ఎస్ఎన్ఎఫ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కుమరేషన్ రాజేంద్రన్


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన సంస్థ చైర్మన్ కుమరేషన్ రాజేంద్రన్


ఎస్ఎన్ఎఫ్ అందజేసిన కంప్యూటర్లతో శిక్షణ పొందుతున్న మునగపాక జెడ్పీ స్కూల్ విద్యార్థులు

మునగపాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతలో భాగంగా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్టు ఎస్ఎన్ఎఫ్ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కుమరేషన్ రాజేంద్రన్ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. జిల్లాలో అనేక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కంపెనీ హెచ్ఆర్,సీఎస్ హెడ్ అనిత సాహు మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి విద్యార్థులంతా కంప్యూటర్ పరిజ్ఞానం పూర్తి స్థాయిలో సొంతం చేసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.6లక్షలు విలువ చేసే కంప్యూటర్లతోపాటు 20 టేబుల్లు, కుర్చీలను ఇచ్చారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, సేఫ్టీ విభాగం అధికారి అప్పలనాయుడు, హెచ్ఆర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు, మద్దతు తెలుపుతున్న ఎంపీపీ గోవింద్ స్థానిక నేతలు

ఎలమంచిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):యర్రవరం సమీపంలోని ప్రైవేటు కంపెనీ ఉద్యోగి బొద్దపు త్రినాథ్ జనవరి నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, అతని కుటుంబాన్ని కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలంటూ సోమవారం పరిశ్రమ వద్ద కుటుంబ సభ్యులతోపాటు పెదపల్లి గ్రామస్థులు ఆందోళన చేశారు. బాధిత కుటుంబీకులకు ఎంపీపీ బోదెపు గోవింద్, పెదపల్లి నేతలు దాసరి కుమార్, బొద్దపు యర్రయ్యదొర, మాజీ సర్పంచ్ కోడిగుడ్ల రమణబాబు, దాసరి గణేష్ తదితరులు మద్దతు తెలిపారు. కంపెనీ పనిమీద వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో త్రినాథ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేదలమైన తమ కుటుంబాన్ని ఆదుకునేందుకు పరిశ్రమ యాజమాన్యం ముందుకు రావాలని కోరారు. ఆందోళనలో త్రినాథ్ కుటుంబ సభ్యులు, పెదపల్లి వార్డు ప్రజలు పాల్గొన్నారు. సంఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ సావిత్రి పరిశీలించారు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి


ఆరో తరగతి విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేట, ఉద్దండపురం, నక్కపల్లి, దేవవరం, పెదబోదిగల్లం హైస్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. సోమవారం ఎంఈవో-1 నరేశ్, ఎంఈవో-2 వేమగిరి నూకరాజు ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలను ఉపాధ్యాయులు సందర్శించారు. సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచులు, పెద్దలతో కలిసి సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. గ్రామాల్లో ఐదో తరగతి నుంచి ఆరో తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులందరినీ గుర్తించి, సమీపంలో వున్న హైస్కూళ్లల్లో చేర్పించాలని సూచించారు. కొందరి పిల్లలతో ఎన్‌రోల్‌మెంట్ చేయించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


శ్రీవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లి మైహోమ్ సిమెంట్ పరిశ్రమ శ్రీనగర్ కాలనీలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 20 నుంచి వ్యూహ లక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం రెండో రోజు యాగశాలలో ద్వారతోరణ, ధ్వజ కుంబ ఆరాధన, అనంతరం స్వామివారి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించినట్టు పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజరు బి.రామస్వామి తెలిపారు. మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని, మైహోమ్ గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర రావు, కుమారి దంపతుల చేతులు మీదుగా చినజీయర్ స్వామి మంగళా శాసనాలతో నిర్వహిస్తారన్నారు.

తిమ్మరాజుపేటలో ఉపాధి పనులు పునరుద్ధరించాలి


ఉపాధి పనులు పునరుద్ధరించాలని ఆందోళన చేస్తున్న కూలీలు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటలో ఉపాధి పనులు నిలిపి వేయడంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి కూలీలు ఆందోళన చేశారు. ఈ గ్రామంలో వారం రోజులు మాత్రమే పనులు కల్పించారని, తిరిగి పనులను కల్పించాలని వారు కోరారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీ పనులు కల్పించకపోతే భృతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు లావేటి పార్వతి, అచ్చిబాబు, లక్ష్మి, వెలగా మహాలక్ష్మి, వేగి వెంకునాయుడు, పి.అప్పలనర్స డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ భూముల్లో పండ్ల తోటల పెంపకం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలు పండించకుండా ఖాళీగా ఉన్న భూముల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నదని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో మండలంలో 185 హెక్టార్ల ఖాళీ భూమి ఉన్నదని, ఆ భూముల్లో రైతులతో మొక్కలు నాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో ఎరకయ్య, ఏవో సౌజన్య, హార్టికల్చర్ అధికారిణి సాయిప్రియ పాల్గొన్నారు.

ఘనంగా పట్టభద్రుల దినోత్సవం


పట్టభద్రుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశాఖ పబ్లిక్ స్కూల్‌లో పట్టభద్రుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టభద్రుల దుస్తులు ధరించిన విద్యార్థులు అందరినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గండిబోయిన అప్పలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం మల్లవరం, నరేంద్రపురంలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో సాల్ట్ కాలనీతోపాటు కె వాతాడ, చినఉప్పలం, బంగారమ్మపాలెం గ్రామాల్లో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై నుంచి ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతోపాటు ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మునగపాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ పి.శ్రీలక్ష్మి తెలిపారు. 249 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా సోమవారం జరిగిన పరీక్షకు 216 మంది హాజరయ్యారన్నారు. రిజర్వేషన్ ప్రకారం మార్కులు ప్రాధాన్యత బట్టి 100 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు.

ఘనంగా శ్రీరామరక్ష రథయాత్ర


దిబ్బపాలెంలో జరుగుతున్న రథయాత్ర

అచ్యుతాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ రక్ష రథయాత్ర సోమవారం సాయంత్రం వెదురువాడ, గొర్లెధర్మవరం, వెంకటాపురం, లంకధర్మవరం, సెజ్ పునరావాస కాలనీ, దిబ్బపాలెంల్లో ఘనంగా జరిగింది. రథానికి భక్తులు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, చేకూరి శ్రీనివాసరాజు, కొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షా కేంద్రంగా ఎస్‌వీఎస్ కళాశాల

ఎస్. రాయవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు అడ్డరోడ్డులోని ఎస్‌వీఎస్ కళాశాలకు ఏయూ ఎంపిక చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రకాష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు స్వేసెస్ డిగ్రీ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్‌కు 360 విద్యార్థులు, అలాగే ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్‌కు 300 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్షలు నిర్వహించేందుకు నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివయ్యను పరిశీలకునిగా నియమించారని ఆయన చెప్పారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


ఎక్సైజ్ పోలీసుల అదుపులో అక్రమ మద్యం విక్రయదారుడు

మునగపాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒంపోలు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి ఎక్సైజ్ ఎస్ఐ ఎస్‌వీ.నారాయణ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామంలో తనిఖీలు చేశామన్నారు. గ్రామానికి చెందిన మంత్రి గణేష్ ఈశ్వర్ సంతోష్ నాగఅప్పారావు వద్ద ఏడు మద్యం సీసాలను గుర్తించామన్నారు. సరైన వివరాలు, ఆధారాలు చూపకపోవడంతో ఎక్సైజ్ చట్టం ప్రకారం అరెస్టు చేసినట్టు చెప్పారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26 వ తేదీన అనకాపల్లిలోని సూర్యనారాయణ మందిరం వద్ద ప్రారంభమయ్యే హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, చైర్‌పర్సన్ రమాకుమారి పిలుపునిచ్చారు. సోమవారం ఎలమంచిలిలో చైర్‌పర్సన్ స్వగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలంతా ఈ యాత్రను విజయవంతం చేసేందుకు తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్, ఎస్ఎస్ఎఫ్, బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నక్కపల్లి ఆస్పత్రిని తనిఖీ చేసిన జిల్లా క్షయ నివారణాధికారి


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి బాలాజీ

నక్కపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రం, ఆర్ఎన్‌టీసీపీ యూనిట్లను సోమవారం జిల్లా క్షయ నివారణ, ఎయిడ్స్ కంట్రోల్, కుష్ఠు వ్యాధి నివారణాధికారి ఎంఎస్ వీకే బాలాజీ తనిఖీ చేశారు. ఐసీటీసీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తనను కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో క్షయ, కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చాలా మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రతీ నెలా రూ.10 వేలు విలువైన మందులు, పెన్షన్ ఇస్తున్నట్టు చెప్పారు. క్రమం తప్పకుండా మందులు ఇవ్వడం వల్ల లైఫ్ టైం పెరుగుతోందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి


పోస్టరును ఆవిష్కరిస్తున్న టీచర్లు, గ్రామస్థులు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం ద్వారా వారి జీవితాలకు బంగారు భవితకు బాటలు వేసిన వారవుతారని తిమ్మరాజుపేట ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో యూటీఎఫ్ ముద్రించిన పోస్టరును గ్రామ పెద్దలతో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థికి ప్రతి ఏటా రూ.50 వేల వరకూ ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. చక్కని సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో తల్లికి వందనం, వైద్య పరీక్షలు, ఉచిత పుస్తకాలు, యూనిఫారాలు వంటి అనేక ప్రయోజనాలను అందిస్తుందన్నారు. ప్రతి తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శరగడం శివబాపునాయుడు, కర్రి అప్పారావు, శరగడం నాగార్జున, కర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాల్సిందే

» ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు ఎంఈవో ఆదేశం


సమావేశంలో ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని ఎంఈవో వేణుగోపాలరావు ఆదేశించారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం మండలంలో ఉన్న ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ, మైనార్టీ, ఇతరులకు 6 శాతం, అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ పీడితులకు 5 శాతంగా సీట్లు కేటాయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2లక్షలు, పట్టణ పరిధిలో రూ.1.44లక్షలు ఆదాయ పరిమితి ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల ప్రతినిధులు వేగి వీరునాయుడు, ఏఆర్‌వీ.సత్యనారాయణ, వేగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


రేగుపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ

ఎలమంచిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. సోమవారం రేగుపాలెం సమీపంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీల సమస్యలను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు గత 10 వారాల నుంచి వేతన బిల్లులు అందడం లేదన్నారు. పని జరుగుతున్న ప్రదేశాల్లో నిబంధనలు విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేత పవన్, కార్మికులు పాల్గొన్నారు.

బోరుమంటున్నారు..



ఎరకన్నపాలెంలో ఎంత లోతు తవ్వినా నీరు పడని బోరు

మాకవరపాలెం మండలంలో తాగునీటి కష్టాలు

మండల కేంద్రంలోనే మూలకు చేరిన నాలుగు బోర్లు

ఎరకన్నపాలెంలో అడుగంటిన భూగర్భ జలాలు

బోర్లు కోసం ఎంత లోతు తవ్వినా పడని నీరు

వేసవిలో గుక్కెడు నీటికి ప్రజల అగచాట్లు

ఉన్నవి పనిచేయవు.. లేనిచోట పడవు! ఇదీ మాకవరపాలెం మండలంలో బోర్ల దుస్థితి. మండల కేంద్రంలో నాలుగు బోర్లు ఉన్నప్పటికీ చుక్క నీరు విదల్చకపోగా, ఎరకన్నపాలెంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్ల కోసం ఎంత లోతు తవ్వినా నీరు రావడం లేదు. ఫలితంగా మండు వేసవిలో గుక్కెడు నీటి కోసం ప్రజలు 'బోరు'మని రోదిస్తున్నారు.

మాకవరపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరకన్నపాలెం గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటికి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఎండలు మండిపోతున్న తరుణంలో గ్రామంలో రక్షిత నీటి పథకం సక్రమంగా పనిచేయకపోవడం.. బోర్లు కోసం ఎంత లోతు తవ్వినా నీరు పడకపోవడంతో వారు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. గ్రామ సర్పంచ్ రుత్తల సీతారాముడు నాలుగు చోట్ల తాగునీటి బోర్లు తవ్వించినప్పటికీ చుక్కనీరు పడకపోవడంతో కష్టాలు మరింత ఎక్కువయ్యాయి.

మండలంలో అల్యూమినియం కంపెనికి ఆనుకొని ఎరకన్నపాలెం గ్రామం ఉంది. ఈ గ్రామంలో సుమారు 600 మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామం కంపెనీకి ఎగువ ప్రాంతంలో ఉండడంతో భూగర్భ జలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కంపెనీ యాజమాన్యం సుమారు పది అడుగుల లోతులో చెరువు ఏర్పాటు చేసింది. అలాగే చెరువు చుట్టూ బోర్లు తవ్వడంతో నీటి జలాలు మొత్తం లాగేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అలాగే గ్రామం ఎత్తులో ఉండడంతో నీటి జలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పలు చోట్ల బోర్లు తవ్వించినప్పటికీ నీటి జలాలు లేకపోవడంతో ఫలితం లేకపోతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో జలజీవన్ ద్వారా పైపులైన్లు వేశారు. వీటి నుంచి కూడా నాలుగు రోజులకోసారి కుళాయిల నుంచి అర గంట పాటు నీరు వస్తున్నదని, అది కూడా కొందరికి మాత్రమేనని అందుతున్నదని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం రావడంతో తాగునీటి కష్టాలు మరింత పెరిగాయని వాపోయారు. రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో నేల బావిలో నీరు ఇంకిపోతున్నదని, మరికొన్ని రోజుల్లో తమ పరిస్థితి తలచుకుంటేనే భయమేస్తున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.



ఎరకన్నపాలెంలో మూడు బోర్లు పడకపోవడంతో నాలుగో బోరు కొడుతున్న దృశ్యం

మాకవరపాలెంలో మరుగునపడ్డ బోర్లు

ఎరకన్నపాలెంలో ఎంత లోతు తవ్వినా బోర్లు పడకపోగా, మండల కేంద్రమైన మాకవరపాలెంలోని బీసీ కాలనీలో బోర్లు వృథాగా పడివున్నాయి. ఇక్కడ సుమారు నాలుగు బోర్లు ఉండగా, అందరూ వీటిపైనా ఆధారపడుతున్నారు. అయితే కాలక్రమేణా బోర్లు మరమ్మతులకు గురికాగా, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో ఈ బోర్లు పూర్తిగా మరుగున పడ్డాయి. కొన్ని చోట్ల బోర్లు కిందపడి ఉండగా, మరికొన్ని చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. ఇదిలా ఉండగా మరో బోరుకు ప్రైవేటు వ్యక్తులు మోటారు ఏర్పాటుచేసి ఎంచక్కా తాగునీటికి వాడుకుంటున్నారు. అయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తు న్నారని స్థానిక ప్రజలు 'బోరు'మంటున్నారు. బోర్లు పనిచేయక, కుళాయిలు నుంచి నీరు సరఫరా కాక తాగునీటికి



మాకవరపాలెంలో అధికారుల నిర్లక్ష్యంతో మరుగున పడిపోయిన బోరు

తీవ్రమైన అవస్థలు పడుతున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోర్లు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, కుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా వచ్చేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గొలుగొండలో తాగునీటి సమస్య

గొలుగొండ: మండల కేంద్రం గొలుగొండలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. రోజు తప్పించి రోజు తాగునీరు అందుతున్న దని, అదీ అరకొరగానే వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ నిరంతరం తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ పథకం పనులు పూర్తిచేసినా ఫలితం లేకపోతున్నదని మహిళలు వాపోయారు. రెండు నెలలుగా రోజు తప్పించి మరుసటి రోజు తాగు నీరు అందుతున్నదన్నారు. అదీ రెండు బిందెల కంటే అధికంగా రాకపోవడంతో తాగునీరు సరిపడక అవస్థలు పడుతున్నామని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో తాగునీరు అందే విధంగా పాలకులు, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటరమణనను వివరణ కోరగా, చోద్యంలో తాగునీటి పథకం విద్యుత్ మోటారు మరమ్మతులకు గురికావడంతో నిరంతరం నీరు అందించలేకపోతున్నామని చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.



మాకవరపాలెం బీసీ కాలనీలో బీసీ కాలనీలో అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రైవేటు వ్యక్తి సొంతానికి వాడుకుంటున్న మరో ప్రభుత్వ బోరు



ఆర్.వెంకయ్యపాలెం పాఠశాలను పరిశీలిస్తున్న విచారణ కమిటీ ప్రతినిధులు

వెంకయ్యపాలెం పాఠశాలలో సదుపాయాల పరిశీలన

నాతవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాలను సంయుక్త విచారణ కమిటీ ప్రతినిధులు, నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ, జిల్లా విద్యా శాఖ అధికారి అప్పారావునాయుడు సోమవారం సందర్శించారు. ఈ పాఠశాలలో మౌలిక వసతులు ఉన్నది? లేనిది పరిశీలించారు. మూడేళ్ల క్రితం పాఠశాలకు భవనం, మౌలిక వసతులు లేవని బాలల హక్కుల కమిషన్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కమిషన్ ఆదేశాల మేరకు కమిటీ ప్రతినిధులు పాఠశాలను సందర్శించి మౌలిక వసతుల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు రెండో విడతలో ఆర్.వెంకయ్యపాలెంలో నూతన పాఠశాల భవనం, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్టు గ్రామస్థులు కమిటీకి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-1, 2 సత్యనారాయణ, కె.వరహాలబాబు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: ఆర్డీవో

నర్సీపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆర్డీవో వీవీ.రమణ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజల నుంచి 14 వినతులు వచ్చాయి. సుంకపూరు సర్వే నంబరు 178/1లో 16 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాలని గొలుగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొడ్డు వరలక్ష్మి వినతిపత్రం అందజేశారు. రోలుగుంట మండలం అడ్డసారం గ్రామంలో సర్వే నంబరు 82లో 11, 18 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాలని మాకవరపాలెం మండలం సీతన్న అగ్రహారానికి చెందిన పాము అప్పలనాయుడు అర్జీ పెట్టుకున్నాడు. ఈ సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ర్యాలీ



నర్సీపట్నం రహదారిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

నర్సీపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. సోమవారం స్థానిక జామియా మసీదు దగ్గర నుంచి అబీద్ సెంటర్, పాల్‌ఘాట్ కూడలి మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో వీవీరమణకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేయడం ముస్లింల సంక్షేమానికి ఇచ్చిన ఆస్తులు కబళించే విధంగా ఉందని తెలిపారు. ముస్లింల ధర్మం, నియమాల ప్రకారం ఒకసారి దానం చేసిన ఆస్తిని ఇతర కార్యకలాపాలకు వాడకూడదన్నారు. చట్ట సవరణ చేసేటప్పుడు మేధావులు, విద్యావేత్తలు, ముస్లిం సమాజం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ సవరణ చట్టం అమలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా పయనించండి

▸▸ జిల్లా ఇన్‌చార్జి మత్స్య శాఖ అధికారి విజయ్‌కృష్ణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కృష్ణ

దేవరాపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధన దిశగా పయనించాలని జిల్లా ఇన్‌చార్జి మత్స్య శాఖాధికారి విజయ్‌కృష్ణ సూచించారు. రైవాడ రామాలయం వద్ద హెల్ప్ ఫుల్ హేండ్స్ సామాజిక వారధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థుల భవిష్యత్ ప్రణాళిక, లక్ష్యాలు, కెరీర్ గైడెన్స్‌పై ఆదివారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆబోతు రమణ, నాయకులు చల్లానాయుడు, ఉగ్రూకల అప్పారావు, వారాదినాయుడు, నానాజీ, కొట్టాడ వెంకట్, శ్రీను, అప్పలరాజు, గోవింద పాల్గొన్నారు.

విద్యార్థుల విలీన ప్రక్రియకు స్వస్తి

▸▸ పాత పాఠశాలకు చేరుకున్న 3, 4 తరగతుల విద్యార్థులు



ఏఎల్‌పురం హైస్కూల్ నుంచి మరో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 3, 4 తరగతి విద్యార్థులు ఎట్టకేలకు సోమవారం తమ పాఠశాలలకు చేరుకున్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్-117 ప్రకారం ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన విషయం తెలిసిందే. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేసినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ జీవోను మార్పు చేయడంతో, తిరిగి పాత పాఠశాలలకు 3, 4 తరగతుల విద్యార్థులను పంపుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌పురం హైస్కూల్ హెచ్ఎంలు నాగభూషణం, ఈశ్వరి పాల్గొన్నారు.

'పాఠశాల భవనంపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనం'



ప్రైవేటు పేరుతో ఉన్న పాఠశాల స్టేజీ

మాకవరపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న భవనంపై ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారని మాకవరపాలెం గ్రామ సర్పంచ్ అల్లుపల్లిం శిరీషా ఆరోపించారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రామారావుకు ఫిర్యాదు చేశారు. ఈ పాఠశాలలో రూ.5 లక్షల ప్రభుత్వ నిధులతో స్టేజీ నిర్మించగా, దానికి గౌతిమి లలితా కళా వేదిక పేరు పెట్టి నడుపుతున్నారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ సాయంత్రం ఇక్కడే కూర్చొని రాత్రి పది గంటల వరకు సమావేశాలు నిర్వహిస్తున్నారని, విద్యుత్‌ను ఉచితంగా వాడుతున్నారని, ఇంత జరుగుతున్నా ఉపాధ్యాయులు మౌనంగా ఉంటున్నారని సర్పంచ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 26న జరగనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమంలో భాగంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 15 ప్రముఖ కంపెనీలు రానున్నాయని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఆఫర్ లెటర్లు అందిస్తాయని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి నిరుద్యోగ యువతీ, యువకులు ఈ మెగా జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులకు భోజన సదుపాయం కూడా కల్పిస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

చోడవరంలో విద్యుత్ అవాంతరాలకు శాశ్వత పరిష్కారం

చోడవరం పట్టణంలో విద్యుత్ అవాంతరాలకు శాశ్వత పరిష్కారానికి 33



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే రాజు చెప్పారు. అలాగే పట్టణంలో లోవోల్టేజీ సమస్యల పరిష్కారం కోసం అదనంగా 16 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే నియోజకవర్గ కేంద్రంలో విద్యుత్ సరఫరా సమస్యలకు ఆస్కారం ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మోడల్ స్కూల్‌లో ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

చీడికాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మంచాల మోడల్ స్కూల్‌లో ఈ ఏడాది ఆరో తరగతిలో చేరేందుకు సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇంగ్లీష్ మీడియంలో 80 సీట్లకు 153 మంది దరఖాస్తు చేయగా, ప్రవేశ పరీక్ష 120 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ఆమె చెప్పారు.

వారపు సంతలో పెరిగిన చింతపండు ధర

మాడుగుల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వారపు సంతలో చింతపండు ధర పెరిగింది. గత వారం కంటే ఈ వారం ధర రైతులకు ఆశాజనకంగానే వచ్చింది. వంట్లమామిడి, కక్కి, నలుగు, దేవాపురం, వంట్లమామిడి, పులుసుమామిడి, కందులపాలెం, ఈదులపాలెం తదితర గిరిజన గ్రామాల నుంచి సంతలో విక్రయించేందుకు కావిళ్లతో, తట్టలతో చింతపండు తీసుకువచ్చారు. గత వారం సుమారు 30 కిలోల బరువు గల కావిడి చింతపండు రూ.2 వేల రూ.2,300 ధర పలకగా, ఈ వారం రూ.2,500కు అమ్ముడుపోయింది. అలాగే చింతబొట్టలు కావిడి గత వారం రూ.1300 అమ్మగా, ఈ వారం రూ.1600కు పైగా అమ్ముపోయింది. దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు జిల్లేడిపూడిలో పట్టాలమ్మతల్లి జాతర

నాతవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేడిపూడి గ్రామంలో మంగళవారం పట్టాలమ్మతల్లి జాతర నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

మేడివాడలో సారాతో ఇద్దరి అరెస్టు

రావికమతం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మేడివాడ శివారు జీడి తోటల్లో నాటు సారా బట్టీలపై సోమవారం దాడులు నిర్వహించామని మాడుగుల ఎక్సైజ్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. సారా తయారు చేస్తున్న మేడివాడకు చెందిన గేడి చిన్నాలు, రమణను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. అలాగే సారా తయారికి సిద్ధం చేసిన 1500 లీటర్ల బెల్లం పులుసును, తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

పశువుల పాక, వరిగడ్డి కుప్ప దగ్ధం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బిపి.అగ్రహారం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పశువులపాక, వరిగడ్డి కుప్ప దగ్ధమయ్యాయి. చెక్కన పైడినాయుడు పశువులను మేతకు తీసుకువెళ్లగా, దాణా ఉడకబెట్టిన నిప్పురవ్వలు పాకపై పడి మంటలు వ్యాపించాయి. ఈ సమయంలో పశువులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం తెలిసిన వెంటనే రావికమతం అగ్నిమాపకదళ సిబ్బంది సంఘటనా చేరుకున్నప్పటికీ అప్పటికే పశువుల పాకతో పాటు వరిగడ్డి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

సులాభ్ కాంప్లెక్స్ కోసం మహిళల ఆందోళన



చోడవరంలో సులాభ్ కాంప్లెక్స్ కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

చోడవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వివిధ పనుల నిమిత్తం నియోజరకవర్గ కేంద్రానికి వచ్చే పురుషులు, మహిళల కోసం సులాభ్ కాంప్లెక్స్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమమవారం మహిళలు ఆందోళనకు దిగారు. తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఎంపీడీవో, ట్రెజరీ, పోలీస్ స్టేషన్ వంటి కార్యాలయాల పనులపై ఎంతో మంది వస్తుంటారని, ప్రత్యేకించి మహిళలకు టాయిలెట్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెప్పారు. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చోడవరంలో సులాభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బి.ఉమా, ఎస్.అమ్మాజీ, డి.సత్యవతి, టి.వరలక్ష్మి, మణి, పార్వతి, దేవి, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్పీపై చర్యలు తీసుకోవాలని కూలీల నిరసన

చీడికాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో పనులు చేసినా మస్తర్లు వేయని వీఆర్పీ గాడి సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని బైలపూడి గ్రామ కూలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు చంద్రదేవి గ్రూపు సభ్యులు పని ప్రదేశంలో సోమవారం నిరసన తెలిపారు. ఉపాధి పనుల నిమిత్తం 20 మంది సభ్యులు వెళ్లగా, నలుగురికి మాత్రమే మస్తర్లు వేశారని సభ్యులు గాడి కన్నతల్లి, గాడి లక్ష్మి, మోసూరి లక్ష్మి, మోసూరి మహలక్ష్మి, జె.అప్పారావు, ఈశ్వరరావు తదితరులు ఆరోపించారు. అందరిలాగే తాము కూడా ఉదయం 5.30 గంటలకు పని ప్రదేశానికి చేరుకున్నామని, అయినా వీఆర్పీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై ఏపీవోకి తెలియజేసినా పట్టించుకోలేదని వారు తెలిపారు. బుధవారం జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతామని స్పష్టం చేశారు. ఈ విషయమై ఏపీవో అల్లు గంగునాయుడును వివరణ కోరగా మంగళవారం బైలపూడి గ్రామానికి వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం..

దేవరాపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడిన మహనీయులు జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ ఆశయాల సాధనకు పాటుపడదామని బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఆతవ ఉదయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. రైవాడ అతిథి గృహ ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ కృషి ఫలితంగా అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. అలాగే జ్యోతిరావు పూలే సమాజానికి చేసిన సేవలను వివరించారు. అనంతరం అంబేడ్కర్ సేవారత్న అవార్డు గ్రహీత అప్పారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణరాజు, తహసీల్దార్ లక్ష్మీదేవీ, సర్పంచ్ పెంటమ్మ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, అన్ని పార్టీలు, సంఘాల నాయకులు బాబూరావు, ఎం.కృష్ణమూర్తి, రామ్మూర్తినాయుడు, కరుణాకరరావు, కన్నబాబు, కె.సాయిసుందర్, జి.అప్పలరాజు, సింహాచలంనాయుడు, కేవీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

208 గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తి

▸▸ నర్సీపట్నం డివిజనల్ సర్వేయర్ బంగారుదేవి

మాకవరపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డివిజన్ పరిధిలో 208 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామని డివిజనల్ సర్వేయర్ బంగారుదేవి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సచివాలయ సర్వే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్ స్థాయిలో రీ సర్వే చేసేందుకు 315 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. అయితే ఇంతవరకు గొలుగొండ, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం మండలాల్లో 208 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. రెండో విడతగా రాచపల్లి గ్రామంలో రీ సర్వే ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు. గత 15 ఏళ్లుగా రాచపల్లి భూములు ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదయ్యాయని, ఈ సర్వేతో రైతులకు పూర్తి హక్కులు లభిస్తాయని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో రీ సర్వే డీటీ కృష్ణమూర్తి, వీఆర్వో సాంబ, సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల చేసుకోండి

నర్సీపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రావికమతం, నర్సీపట్నం మండలాల పరిధిలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో తలుపులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయించినట్టు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నెల 28 నుంచి మే 15 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 16న విద్యార్థులు అర్హత నిర్ధారణ, 21న లాటరీ ద్వారా విద్యార్థులకు సీట్లు కల్పిస్తామని ఆయన తెలిపారు. రెండో విడత సీట్లు కేటాయించడానికి జూన్ 6న డ్రా తీస్తామన్నారు.

జంగిల్ క్లియరెన్స్ వేగవంతం చేయండి

నాతవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల గట్లపై జంగిల్ క్లియరెన్స్ పనులు వేగవంతం చేయాలని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ ఆదేశించారు. కురువాడ గ్రామంలో రూ.9.5 లక్షలతో చేపడతున్న జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ నాటికి కాలువల్లో పూడికతీతతో పాటు గట్లపై జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేస్తే ఆయకట్టు రైతులకు, సిబ్బందికి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో ఉపాధి పథకం ఏపీవో కొండజీ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, తాండవ నీటి సంఘం అధ్యక్షుడు ఎం.సత్యప్రసాద్, టీడీపీ నాయకులు జి.శ్రీనివాసరావు, కె.నూకరాజు, అప్పన విజయ్, సత్యనారాయణ, శ్రీరాములు, కె.దివాణం, గోవిందరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

రావికమతం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు ఎంఈవో సిహెచ్.తలుపులు చెప్పారు. టి.అర్జాపురం హైస్కూల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు తల్లికి వందనం, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు. అనంతరం ఆరో తరగతిలో చేరిన 71 మంది విద్యార్థులకు ఆయన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచ్ మడగల పాల్గున, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పెంటారావు, హెచ్ఎం కెఆర్ఎస్.నాయుడు, సీఆర్పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఇన్వర్టర్ వితరణ

రావికమతం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట గ్రంథాలయానికి పాఠకుల అభ్యర్థన మేరకు గ్రామానికి చెందిన పైల సన్యాసమ్మ కుమారులు సోమవారం ఇన్వర్టర్‌ను వితరణగా అందజేశారు. ఈ గంథాలయానికి నిత్యం వివిధ గ్రామాల నుంచి నిరుద్యోగ యవకులు వచ్చి చదువుకుంటారు. వేసవికాలంలో కరెంట్ లేకపోయినా ఇబ్బంది లేకుండా ఈ ఇన్వర్టర్‌ను అందించామని దాతలు తెలిపారు. గ్రంథాలయాధికారి వరహామణి, కొత్తకోట ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీకేవీధిలో భారీ వర్షం



గూడెంకొత్తవీధిలో కురుస్తున్న వర్షం

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):మండలంలో భారీ వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం పడింది. వర్షానికి ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. ఆర్‌వీనగర్ వారపు సంతల్లో వర్షం వల్ల వర్తకులు, వినియోగదారులు అవస్థలు పడ్డారు.

దశల వారీగా రహదారుల పనులు : ఎంపీపీ



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అప్పలరాజు

జి.మాడుగుల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దశల వారీగా మండలంలోని రహదారుల పనుల చేపడతామని ఎంపీపీ లోంబోరి అప్పలరాజు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కుంబిడిసింగి పంచాయతీ కేంద్రంలో రూ.3లక్షలతో సీసీ రోడ్డు పనులకు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వంలో మారుమూల ప్రాంతాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హయాంలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. కృష్ణమూర్తి, స్థానిక టీడీపీ నాయకులు మాతె రామరాజు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కి ఎంపికైన విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు అందజేస్తుందని స్థానికఎంఈవో పీబీవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని చౌడుపల్లి ఎంపీయూపీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎనిమిదో తరగతిలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎన్‌ఎం ఎంఎస్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్ వరకు ప్రతి ఏడాది రూ.12వేల ఉపకారవేతనాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



పిల్లలను చేర్పించాలని ప్రచారం చేపడుతున్న యూటీఎఫ్ నేతలు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు నిండిన బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సమరెడ్డి రాజు సూచించారు. యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి మండలంలోని దారెల పంచాయతీ పేటమాలిపుట్టు, పెదపేట, గన్నెడ, దారెల తదితర గ్రామాల్లో సోమవారం ఊరి బడి కోసం-పోరు బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు-ప్రైవేటు పాఠశాలలు వద్దని, ఊరిలో ఉండే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచించారు. యూటీఎఫ్ చేసే పోరుబాటకు తల్లిదండ్రులు తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మొశ్యా ధర్మారావు, కార్యదర్శి సీసా గోపి, మండల కోశాధికారి కూడా శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు రమేశ్, లీలావతి, రాధా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్చాలని అవగాహన ర్యాలీ



ప్రభుత్వ బడిలో పిల్లను చేర్చాలని ర్యాలీ చేస్తున్న నాయకులు

అనంతగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలగెడ్డ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిద్దామని యూటీఎఫ్ నాయకులు సోమవారం ర్యాలీ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దేముడు మాట్లాడుతూ. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలోని ఎస్.రాంబాబు, ఎన్.మల్లేశ్వరరావు, కె.రఘు, కె.ప్రసాద్, సూరిబాబు, కనక మహాలక్ష్మి, చిన్నమ్మి, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలు

పెదబయలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలు జరుగుతున్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ అమిత్ ఆనంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు ఎంపికైన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

హామీలు నేరవేరుస్తాం..

మెగా డీఎస్సీల్లో ఎస్టీలకు 2100 కేటాయింపు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యరాణి



గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి



డిగ్రీ కళాశాల అదనపు భ వనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి, పక్కన జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతీ హామీని ఒక్కొక్కటిగా నేరవేరుస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యరాణి తెలిపారు. మండల కేంద్రంలో రూ.కోటి నిర్మించిన డిగ్రీ కళాశాల అదనపు భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ముందుగా గిరిజన సంప్రదాయంతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యాలను వేసి ఆలరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూమెగా డీఎస్సీ ద్వారా 16,500 పోస్టులకు భర్తీ చేస్తున్నామని, ఇందులో ఎస్టీలకు 2100 పోస్టులను కేటాయించామని చెప్పారు. మిగిలిన ఉపాధ్యాయ ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేస్తామన్నారు. ఏ పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపీ ఉన్నారనేది చూడమని, గిరిజన ప్రాంతాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని మంత్రి చెప్పారు. అలాగే కొద్ది రోజులు క్రితం రూ.వెయ్యి కోట్లతో మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శంకుస్థాపనలు చేశామని మంత్రి గుర్తుచేశారు.

జీసీసీని మరింత బలోపేతం చేస్తామం

గిరిజన సహకార సంస్థ (జీసీసీ)ను మరింత బలోపేతం చేస్తామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. అలాగే జీసీసీలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేస్తామన్నారు. మండలానికి ఒక్కో భవనం నిర్మించి, ఆయా గ్రామాల్లో సేకరించిన అటవీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచి విక్రయిస్తామన్నారు. గిరిజనులు దళారీల బారిన పడకుండా, వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ చైర్మెన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్‌గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, సర్పంచ్ దాస్‌బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

టీడీపీ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి



మంత్రి సంధ్యారాణిని సత్కరిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వర్గ విభేదాలు లేకుండా ఏకతాటిపై రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయాలని రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అధ్యక్షతన పాడేరులో నిర్వహించిన పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం ప్రజలను మోసగించారే తప్ప అభివృద్ధి చేసిన దాఖలాలు ఎక్కడ లేదన్నారు. మూడేళ్లుగా ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు జరగలేదంటే స్థానికంగా ఉన్న పాడేరు, అరకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిదులు నిర్లక్ష్యమే కారణమన్నారు. వారు ఏనాడూ గిరిజనుల సమస్యలు పట్టించుకోలేనందునే ఐటీడీఏ పాలక వర్గ సమావేశం జరగలేదన్నారు. జీవో నంబర్ 3ని చంపేసిన వైసీపీ నాయకులు నేడు జీవో నంబర్ 3 పునరుద్ధరణకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేయమనడం గిరిజనుల సానుభూతి పొందేందుకే అని అన్నారు. అసభ్యంగా వ్యవహరించడం, ఎదురు దాడులకు దిగడం వైసీపీ నాయకులకు అలవాటే అన్నారు. గత ఐదేళ్లలో గిరిజన గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి చేయలేదన్న విషయాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజల దృష్టికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులనే ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లను గెలిపించాలన్నారు. అనంతరం పార్టీ ముఖ్యనాయకులు మంత్రి సంధ్యారాణిని శాలువతో సత్కరించి, మోదకొండమ్మ వారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఈ సమావేశంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఎం.ప్రసాద్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, పార్టీ ముఖ్యనాయకులు కేవీ.రమేష్‌నాయుడు, ఎస్.రత్నకుమారి, చిట్టిబాబు, డప్పోడి వెంకటరమణ, ఎస్వీ రమణమూర్తి, డిప్పల వెంకటకుమారి, రొబ్బి రాము, బి.జ్యోతికిరణ్, ఎ.సుబ్బలక్ష్మి, పూర్ణయ్య, దొరబాబు, చిరంజీవి, పార్వతమ్మ, రూపావతి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులకు మినహాయించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు డిమాండ్



మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పాడేరురూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ నుంచి ఏజెన్సీ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలని, నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ పురుద్ధరణకు ఆర్డినెన్స్ జారీ చేయాలని వివిధ సంఘాల నాయకులు సోమవారం తీర్మానం చేశారు. ఏపీ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మోదకొండమ్మ ఆడిటోరియంలో సోమవారం ఆదివాసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం మాట్లాడుతూ ఆదివాసీలకు చారిత్రిక అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో 881 పోస్టులకు కేవలం 42 పోస్టులు మాత్రమే ఆదివాసీలకు కేటాయించడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి హామీపై నమ్మకంతో ఇప్పటి వరకు వేచిచూశామన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ శతశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. డీఎల్‌వో కేంద్రకమిటీ సభ్యులు ఎస్.మాణిక్యం మాట్లాడుతూ ఉద్యమం ద్వారానే సమస్య పరిష్కారం కానుందని యువత, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకొని ఉద్యమంలోకి రావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయకుంటే నిరవధిక బంద్ నిర్వహిస్తామన్నారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ యువతను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఈనెల 26న పాడేరులో నిర్వహించే ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. అనంతరం అంబేడ్కర్ కూడలిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. సమావేశంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు వల్లా వెంకటరమణ, గిరిజన సంక్షేమ ఉద్యోగ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుముల కాంతారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి ఎల్.సుందరరావు, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాజబాబు, ఎస్ఎఫ్ఐ, బీటీఏ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్, సీఐటీయూ, ఏఐవైఎఫ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా సీఏహెచ్ స్కూల్ మైదానం

- దుర్గంధంతో అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



సీఏహెచ్ స్కూల్ మైదానంలో చెత్త వేసిన దృశ్యం

చింతపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల-1 మైదానం డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతుండడంతో విద్యార్థులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలుర ఆశ్రమ పాఠశాల సమీపంలో ఖాళీ స్థలం ఉంది. ఈ వీధిలో పంచాయతీ అధికారులు ఎటువంటి చెత్త బుట్టలను ఏర్పాటు చేయలేదు. వారపు సంతకు వచ్చిన వర్తకులు, పరిసర ప్రాంత ప్రజలు ఈ మైదానంలో వ్యర్థాలు, చెత్తను పడేస్తున్నారు. దీంతో ఈ ఖాళీ స్థలానికి ఆనుకుని ఉన్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, గృహ నివాసితులు దుర్గంధానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి మైదానంలో ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించాలని, వర్తకులు, ప్రజలు చెత్త ఖాళీ స్థలంలో పడేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠకు పూజలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ ధర్మకర్త తదితరులు

పాడేరురూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాడేరులో పూర్ణపుష్కల సహిత అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠా పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో సోమనాదేశ్వస్వామి శివలింగం, రమాసహిత వీరవెంకట సత్యనారాయణస్వామి, షిర్డీ సాయిబాబా, మహాలక్ష్మి అమ్మవారి నూతన పాలరాతి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 23వ తేదీ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉత్సవ విగ్రహాలను సోమవారం పాడేరు ఊరేగించారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠకు అవసరమై ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు తెలిపారు. మంగళ, బుధవారాలు హోమాలు, పూజలను చేపట్టి బుధవారం ఉదయం 9.28 గంటలకు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠతోపాటు ధ్వజస్తంభ ఆవిష్కరణ చేపడుతున్నామన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందన్నారు. ఈ విగ్రహాలను పట్టణానికి చెందిన భక్తులు నగేష్, సత్తిబాబు, రవి, శ్రీను వితరణ చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్బారావు దంపతులు, సర్పంచ్ ఉషారాణి, ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు దంపతులు, దామో దంపతులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఎంపీపీ ఎ.సీతమ్మ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

లక్ష్య సాధనకు ముందడుగు వేయాలి

కశింకోట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనకు ముందడుగు వేయాలని వెదురుపర్తి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం మూర్తి సూచించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి మార్కులతో పాసైన వారికి చక్కని భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లిలో జాబ్‌మేళా

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు మంగళవారం ఇక్కడ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధి కారి గోవిందరావు తెలిపారు. పూల్‌బాగ్ రోడ్డులో గల అనకాపల్లి ఏడీ స్కూల్‌లో ఈ జాబ్ మేళా ఉంటుం దన్నారు. పదిహేనుకు పైగా కంపెనీలు హాజరై నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు జరిపి, ఉద్యోగావకాశాలు కల్పిస్తాయన్నారు. పదో తరగతి, ఇం టర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల మధ్యగల యువతీ యువకులు అర్హులుగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు 70133 42667 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

శిశువుల సంరక్షణే ముఖ్యం : సీడీపీవో



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శిశువుల సంరక్షణలో తొలి వెయ్యి రోజులు అత్యంత ముఖ్యమని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎ. లక్ష్మీదేవి అన్నారు. సోమవారం పెదవలస, దేవరాపల్లి, దుశ్చరపాలెం సెక్టార్ల పరిధిలో పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. తొలుత సెక్టార్ పరిధిలోనున్న గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లి గర్భం దాలిచిన నాటి నుంచి శిశువుకి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శిశువు జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించడంతోపాటు క్రమంగా టీకాలు వేయించాలన్నారు. తల్లి మంచి పోషకాహారం తీసుకుంటూ శిశువుకి పాలు పెట్టాలన్నారు. పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షణ ఉండాలన్నారు. లోపాలు గుర్తిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకు వెళ్లి చికిత్స అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.వలసమ్మ, డి.మోహిని, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

'నూకరాజు సేవలు అమోఘం'



నూకరాజు స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కొయ్యూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్ఠతోపాటు గిరిజనుల సమస్యలు పరిష్కరించడంలో నూకరాజు చేసిన సేవలు అమోఘమని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. మండలంలో బంగారమ్మపేట మాజీ సర్పంచ్ పాంగి నూకరాజు ఏడో వర్ధంతిని సోమవారం గ్రామంలో కుటుంబీకులు, గ్రామస్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు స్మారక స్థూపం వద్ద పొట్టిక సత్యనారాయణ, పార్టీ నేతలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు, ఉల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాంగి చిట్టిబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రీముల చంద్రరావు, గిరిజన సమాఖ్య మండల కార్యదర్శి దార మల్లేష్, మాజీ సర్పంచ్ పాంగి రాజుబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు

చింతపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని స్థానిక తహసీల్దార్ బి. రవికుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మీకోసంలో వచ్చిన ఫిర్యాదులు, వినతులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. భూసమస్యలు, మ్యూటేషన్‌పై వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే కులం, ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో మంజూరు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రామారావు, అధికారులు పాల్గొన్నారు.

'ఆశ్రమ' విద్యార్థులకు అనధికార సెలవులు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు అనధికార సెలవులు ఇచ్చారు. దీంతో పాఠశాల విద్యార్థులు సోమవారం గృహాలకు వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 23 వరకు నిర్వహించాల్సి వుంది. ఈనెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. అయితే ఈ ఏడాది వార్షిక పరీక్షలు ముందుగానే జరిగిపోవడంతో విద్యార్థులు పాఠశాలలో ఉండేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇదే అదనుగా భావించిన ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు విద్యార్థులను అనధికారికంగా గృహాలకు పంపించేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులు గుడ్ ఫ్రైడే నుంచి వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో 10 శాతం విద్యార్థులు కూడా లేరంటే అతిశయోక్తికాదు. పాఠశాలలో విద్యార్థులు గృహాలకు వెళ్లిపోయినప్పటికి ఉపాధ్యాయులు మెస్ చార్జీలు పూర్తి స్థాయిలో డ్రా చేసుకునేందుకు హాజరు శతశాతం నమోదు చేస్తున్నారు. కేవలం గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఆశ్రమ పాఠశాలలు ఖాళీ అయిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జీకేవీధి పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థినులు

ఎండ 'మండే'



సబ్బవరంలో మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రోడ్డు

సబ్బవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఆరంభంలోనే ఈ ఏడాది ఎండలు మండిపోతున్నాయి. గత మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సూర్యుడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంట్లో ఉన్నా చెమటలు తగ్గడం లేదు. ఆ సమయంలో రోడ్లు చాలా వరకు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. బయటకు వచ్చేందుకు పలువురు భయపడుతున్నారు. తప్పనిసరి స్థితితో వచ్చినవారు సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సబ్బవరం పరిసర గ్రామాల్లో సోమవారం 37 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పొలం పనులు చేసే రైతులు, కూలి పనులకు వెళ్లే కష్టజీవులు ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక చిన్న పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. వివిధ పనులపై బయటకు వచ్చేవారు శీతలపానీయాలు, దాతలు ఏర్పాటు చేసి చలివేంద్రాల్లో గొంతు తడుపుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. ఏదిఏమైనా ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే ఇక వచ్చే నెల అందులోనూ అగ్ని, రోహిణి కార్తెల్లో పరిస్థితి ఏమిటని అంతా ఆందోళన చెందుతున్నారు.

వినాయక ఘాట్ పరిశుభ్రతకు చర్యలు : జడ్సీ



వినాయక ఘాట్‌ను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రమణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదా నది ఒడ్డున గల వినాయక ఘాట్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ తెలిపారు. ఈ నెల 26వ తేదీన హనుమాన్ శోభాయాత్ర జరగనున్న నేపథ్యంలో అధ్వానంగా ఉన్న వినాయక ఘాట్‌ను, శార దానది ఒడ్డును పరిశుభ్రంగా తయారు చేయించాలని నిర్వాహకులు ఇటీవల జీవీఎంసీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కె.రమణను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో భాగంగా కమిషనర్ సోమవారం ఘాట్‌ను పరిశీలించారు. తక్షణమే ఘాట్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్, శోభాయాత్ర నిర్వాహక బృందం సభ్యులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నియంత్రించాలని ఐద్వా ఆందోళన



ఆందోళన చేపడుతున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో బెల్టుషాపులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయన్నారు. వీటి కారణంగా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందని, కొన్ని కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు ఎం.బంగారమ్మ, అన్నపూర్ణ, లావణ్య, ఆర్.సీతామహాలక్ష్మి, జి.లక్ష్మి, శ్రీదేవి, ప్రియాంక, నాగమాల, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : ఐసీడీఎస్ పీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో లలితకుమారి

పరవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వి.లలితకుమారి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లను గూర్చి వివరించారు. పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అంగవైకల్యాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చునన్నారు. అనంతరం పోషణ పదార్థాల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, ఎంపీడీవో కె.ధర్మారావు, వైస్ ఎంపీపీ బూసి అప్పలరాజు, సర్పంచ్‌లు శిరపురపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'విద్యార్థులు లక్ష్య సాధనకు ముందడుగు వేయాలి'



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కశింకోట, ఏప్రిల్ 21 : విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు ప్రీ ఫైనల్ పరీక్షలు దోహదపడతాయని వెదురుపర్తి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి అన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన వివిధ తరగతులకు చెందిన 21 మంది విద్యార్థులకు సోమవారం పాఠశాల ఆవరణలో బహుమతులు అందజేసి మాట్లాడారు. కష్టపడి చదివి మంచి మార్కులతో పాసైన వారికి చక్కని భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ దిశగా విద్యార్థులు లక్ష్యసాధనకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడుగేస్తే.. గాయం ఖాయం..

» ఎన్టీఆర్ వైద్యాలయం ప్రవేశ మార్గంలో ప్రమాదకరంగా మారిన ఐరన్ గ్రిల్స్

» ఇటీవల ఇద్దరి కాళ్లకు గాయాలు » వైద్యం అందించిన సిబ్బంది » ద్విచక్ర వాహనదారులకూ తప్పని ఇబ్బందులు





ఎన్టీఆర్ వైద్యాలయం ముందు కాలువపై వేసిన ఐరన్ గ్రిల్స్.. (ఇన్‌సెట్) తుప్పుపట్టి కనిపిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం ప్రవేశ మార్గంలో కాలువపై ఉన్న ఐరన్ గ్రిల్స్ ప్రమాదకరంగా మారాయి. అవి పాడవ్వడంతో రాకపోకలు సాగించే రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రిల్స్ చాలా వరకు తుప్పుపట్టాయి. దీంతో ఆస్పత్రికి నడిచి వస్తున్న ఎందరో గాయాలకు గురవుతున్నారు. గత వారంలో రేబాకకు చెందిన మహిళ వైద్యాలయంలో చికిత్స పొందున్న రోగిని చూడడానికి వచ్చి గ్రిల్స్ దాటే సమయంలో కాలు వాటి మధ్యలో చిక్కుకుని లోపలికి దూరిపోయింది. కాలును బయటకు తీసేందుకు ఎంత శ్రమించినా ఫలితం లేకపోయింది. చివరకు కొబ్బరినూనె సహాయంతో అతి కష్టమ్మీద బయటకు తీశారు. చిన్నచిన్న గాయాలు కావడంతో వైద్యాలయంలో చికిత్సలు అందించారు. అలాగే ఇటీవల కాలంలో ఆశ వర్కర్లు ఆందోళన చేస్తున్న సందర్భంగా నినాదాలిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కాలు కూడా గ్రిల్స్‌లో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడ్డారు. అయితే ఆయన కాళ్లు సన్నగా ఉండడంతో వెంటనే స్థానికులు గ్రిల్స్ లోంచి బయటకు తీయడంతో వైద్య సిబ్బంది సేవలందించారు.

ఇదిలావుంటే, ఈ గ్రిల్స్ కారణంగా ద్విచక్ర వాహనాలపై లోపలికి వెళ్లేవారు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పలు సందర్భాల్లో వాహనాలు అదుపు తప్పిన సంఘటనలు కూడా ఉన్నాయి. పలుచోట్ల గ్రిల్స్ జంగుపట్టడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి వీటి స్థానంలో కొత్తగా గ్రిల్స్ వేయించాలని అంతా కోరుతున్నారు. ఈ సమస్యను వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా, గ్రిల్స్‌ను మార్పు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టినట్టు చెప్పారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

» సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈడీ సమీర్‌శర్మ

పరవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్‌శర్మ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ప్లాంట్‌లోని అగ్ని టమాపక కేంద్రం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. వారోత్సవాలు సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఈడీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రదర్శించిన అగ్నిమాపక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతా శర్మ, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రామ్‌లహన్‌సింగ్‌లతో పాటు సంస్థలోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల్లో మూడు శాతం స్పోర్ట్స్ కోటా క్రీడాకారులకు వరం

» నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి, తదితరుల హర్షం

» సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం



అనకాపల్లి టౌన్/కొత్తూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో మూడు శాతం స్పోర్ట్స్ కోటా అమలుకు జీవో విడుదల చేయడం క్రీడాకారులకు వరమని నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి అన్నారు. సోమవారం సాయంత్రం ఇక్కడి గవరపాలెం పార్కు సెంటర్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల్లో 65 రకాల క్రీడల్లో ప్రతిభకనబరిచిన వారిని పోలీస్, ఎక్సైజ్, అటవీ, మరికొన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల్లో రాత పరీక్ష లేకుండానే ఉద్యోగ నియామకాలకు ఉత్తర్వులు ఇచ్చిన ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు అనకాపల్లి క్రీడాకారుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరపల్లి కృష్ణాజీ, చంద్రశేఖర్, కర్రి అప్పారావు, దొడ్డి రమణ, పొలిమేర నాయుడు, దాడి అప్పారావు, పలు క్రీడా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకంలో పాల్గొన్న క్రీడాకారులు

సాంకేతిక పరిజ్ఞానంతో యువతకు భవిత



ప్రాజెక్టుల నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు తదితరులు

సబ్బవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో-2 ఎం.రవీంద్రబాబు అన్నారు. ఇక్కడి గురుకుల విద్యాలయంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ కమ్యూనిటీ డేను పురస్కరించుకుని సోమవారం విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టుల నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఈవో మాట్లాడుతూ భవిష్యత్తులో మానవాళికి తలెత్తనున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన పొల్యూషన్ కంట్రోల్ యూనిట్, యాప్ డిజైనింగ్ నమూనా, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, వర్టికల్ ఫార్మింగ్ తదితర నమూనాల ద్వారా వాటి పనితీరు, ఉపయోగాలను విద్యారులు వివరించారు. ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, జె.తిరుపతిరావు, డాక్టర్ కె.కన్నంనాయుడు పాల్గొన్నారు.

కశింకోటకు చేరుకున్న ఇస్కాన్ యాత్ర

» హిందూ ధర్మాన్ని, కృష్ణుని జీవిత చరిత్రను అన్ని రాష్ట్రాల్లో వివరిస్తామని స్వామీజీలు వెల్లడి



కశింకోటలో రథయాత్ర చేపడుతున్న స్వామీజీలు

కశింకోట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత ప్రచారంలో భాగంగా జరుగుతున్న ఇస్కాన్ రథయాత్ర సోమవారం కశింకోటకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో భక్తివేదాంత స్వామి ప్రభుపాద విగ్రహాన్ని ఊరేగించారు. శ్రీకృష్ణుని జన్మస్థలం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర అన్ని రాష్ట్రాల్లోనూ సాగుతుందని స్వామీజీలు తెలిపారు. హిందూ ధర్మాన్ని, కృష్ణుని జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేస్తున్నట్టు చెప్పారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరం వద్ద హారతి ఇచ్చి భగవద్గీతలోని ప్రధాన ఘట్టాలను వివరించారు. మంగళవారం తాళ్లపాలెం గ్రామానికి ఈ యాత్ర చేరుకుంటుందని తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎంఈవోలు



ఎరుకునాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పిన ఉపాధ్యాయినులు

సబ్బవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు సంబంధించి సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అంతా కృషిచేయాలని కోరారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారికి అన్ని సౌకర్యాలు కల్పించి, చక్కని విద్యాబోధన సాగిస్తుందని వివరించారు. అనంతరం ఐదేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సమీపంలో గల ప్రాథమిక పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసిన వారిని సమీప ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



తుమ్మపాలలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయ బృందం

తుమ్మపాల : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తుమ్మపాల జడ్పీ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం కోరారు. ఈ మేరకు సోమవారం ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోధనతో పాటు పిల్లలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అనకాపల్లిలో జాబ్‌మేళా

» 15కు పైగా కంపెనీల ప్రతినిధులు హాజరు

» 18 నుంచి 35 ఏళ్ల మధ్య గలవారు అర్హులు

» జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు మంగళవారం ఇక్కడ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు తెలిపారు. పూల్‌బాగ్ రోడ్డులో గల అనకాపల్లి ఏడీ స్కూల్‌లో ఈ జాబ్ మేళా ఉంటుందన్నారు. పదిహేనుకు పైగా కంపెనీలు హాజరై నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు జరిపి, ఉద్యోగావకాశాలు కల్పిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గల యువతీ యువకులు అర్హులుగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు 70133 42667 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

నేడు దిబ్బలగొర్లివానిపాలెంలో బోయమాంబ పండుగ



పరవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గొర్లివానిపాలెం పంచాయతీ దిబ్బలగొర్లివానిపాలెంలో మంగళవారం బోయమాంబ పండుగ జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు.

ఘనంగా షిర్డీసాయి బాబా దివ్య మందిర వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

పరవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పి.బోనంగిలో షిర్డీసాయి బాబా దివ్యమందిరం వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యం, దత్తాత్రేయ, నవగ్రహమూల మంత్రాలతో సాయినాథునికి హోమం జరిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోషాస్పత్రికి వాటర్ ప్లాంట్ వితరణ



బాలింతలకు బేబి కిట్లు అందిస్తున్న నాగశ్రీను

కొత్తూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని గోషాస్పత్రికి 25 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ప్లాంట్‌ను ఆ పార్టీ నాయకులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు దూలం గోపి, మంగా ఈశ్వర్ మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని అందించేందుకు రాంకీ సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఆసుపత్రిలో చంటి పిల్లలకు కిట్ల పంపిణీ చేశారు. అదే విధంగా ఎన్టీఆర్ వైద్యాలయంలో పసి పిల్లలకు బేబీ కిట్లను నూకాంబిక అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఈసు, కృష్ణ, అబి, అన్వేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహా సభల పోస్టర్లు ఆవిష్కరణ

తుమ్మపాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం కొలువుదీరి పదకొండు నెలలు గడుస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి అన్నారు. సోమవారం ఇక్కడ ఫెడరేషన్ జాతీయ మహా సభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మే 15 నుంచి 18 వరకు ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు వియ్యపురాజు, ఎ.జగదీష్, బొంది సింహాద్రి, పెంటకోట సంతోష్, వెంకటేష్, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు కణుపులతో నారు

విత్తనం ఖర్చు 80 శాతం వరకు ఆదా

- నర్సరీల తరహాలో నారు పెంపకం
- నెల రోజుల తరువాత ప్రధాన పొలంలో నాట్లు
- సంప్రదాయ సాగుతో పోలిస్తే ఎకరాకు 5-10 టన్నులు అధిక దిగుబడి

అనకాపల్లి అగ్రికల్చర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): **చెరకు సాగు వ్యయంలో 15 నుంచి 20 శాతం విత్తనానికే ఖర్చవుతున్నది. ఎకరాకు నాలుగు నుంచి ఆరు టన్నుల విత్తనం అవసరం. ఈ ఖర్చును తగ్గించి, చెరకు దిగుబడి పెంచేందుకు నారు మొక్కలతో సాగు విధానం ఉపయోగపడుతుంది. చెరకు కణుపుల వద్ద రెండు వైపులా అంగుళం చొప్పున కత్తిరించి, నారును పెంచుకుని ప్రధాన పొలంలో నాటుకోవచ్చు. ఇందుకోసం ఒక టన్ను చెరకు కణుపులు సరిపోతాయి. ఒక నారు మొక్క ద్వారా 10 నుంచి 15 కిలోల చెరకు దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. అంతేకాక ఎకరాకు ఐదు నుంచి పది టన్నుల వరకు దిగుబడి పెరుగుతుంది. కణుపు విత్తనం ద్వారా చెరకు నారు పెంపకం గురించి ఆర్‌ఏఆర్‌ఎస్ చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.ఆదిలక్ష్మి తెలిపిన వివరాలిలా వున్నాయి.**


డాక్టర్ బి.ఆదిలక్ష్మి, చెరకు ప్రధాన శాస్త్రవేత్త, ఆర్ఏఆర్ఎస్, అనకాపల్లి

ఆరోగ్యమైన ఆరేడు నెలల లేత చెరకు తోటల నుంచి విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి. జన్యు స్వచ్ఛత గల, వ్యాధిరహిత చెరకు విత్తనం అందుబాటులో వుంటేనే కణుపు నారును ఉత్పత్తి చేసుకోవాలి. చెరకు నుంచి ఒంటికన్ను కణుపులను తీసేందుకు 'బడ్ చిప్' అనే పరికరాన్ని ఉపయోగించాలి. దీని ఖరీదు రూ.20 వేలు. అవసరమైన రైతులు ఆర్ఏఆర్ఎస్‌లో సంప్రదించవచ్చు. యంత్ర పరికరంతో చెరకు కణుకులు (కన్నులు) తీసేటప్పుడు వాటికి దెబ్బతగలకుండా జాగ్రత్తగా తీయాలి. లేకపోతే మొలక శాతం తగ్గిపోతుంది. బడ్(కణుపు) చిప్స్ తీయగా మిగిలిన చెరకును బెల్లం తయారీకి వినియోగించుకోవచ్చు లేదా షుగర్ ఫ్యాక్టరీకి తరలించవచ్చు.

విత్తనం తయారీ

యంత్రంతో చెరకు కణుపు వేరుచేసిన తరువాత విత్తనాన్ని మందు ద్రావకంలో శుద్ధి చేయాలి. ఇందుకోసం లీటరు నీటికి 0.5 గ్రాముల కార్బండిజం, ఒక మిల్లీ లీటర్ మలాథియాన్ కలిపి ఒక తొట్టిలో మందు ద్రావకాన్ని తయారు చేసుకోవాలి. విత్తన కణుపులను ఒక గోనె సంచి (గోగునార)లో వేసి, ఈ మందు ద్రావకం తొట్టిలో 15 నిమిషాలపాటు ముంచి తీయాలి. దీనివల్ల విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లను నివారించుకోవచ్చు. తరువాత గోనెసంచి మూతి కట్టివేసి 48 గంటలపాటు అలాగే వుంచేయాలి. దీంతో కణుపుల వద్ద చిన్నపాటి మొలకలు వస్తాయి. గోనె సంచిలో నుంచి బయటకు తీసి, ప్లాస్టిక్ ట్రేలలో అమర్చుకోవాలి. ఇవి అన్ని నర్సరీల్లో అందుబాటులో వుంటాయి. ఒక్కో ట్రేలో 48 చొప్పున గుంతలు వుంటాయి. ఒక్కో గుంతలో ఒక కణుపు చొప్పున అమర్చుకోవాలి.బాగా చివికిన పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టు, కోకోపిట్‌లను సమభాగాల్లో తీసుకుని బాగా కలుపుకోవాలి. దీనిని ట్రేలలో కణుపులు కనిపించకుండా చల్లుకోవాలి. అనంతరం ఒకదానిపై మరొకటి చొప్పున పది ట్రేలను పెట్టి, గాలి చొరబడకుండా నల్లటి పాలిథిన్ షీట్ కప్పాలి. నాలుగు రోజుల్లో మొలకలు బయటకు వస్తాయి. అనంతరం ట్రేలను చెట్ల నీడన లేదా షేడ్ నెట్‌ల కింద వరుస క్రమంలో అమర్చుకోవాలి. డ్యాన్‌లతో లేదా స్ప్రింక్లర్లతో రోజు విడిచి రోజు నీటిని చల్లాలి. వారం రోజుల్లో నారు ఆకులు వేయడం ప్రారంభం అవుతుంది. మొలక ప్రారంభమైన రెండు వారాలకు మొలక రాని/ పాడైన కణుపులను తీసివేసి కొత్తవాటితో నింపాలి. నాలుగు వారాలకు 3-4 ఆకులు తొడుగుతుంది. వేరు బాగా పెరిగి కొబ్బరి పీచు, మట్టితో చుట్టుకుని ఉంటుంది. ఒక ఎకరా పొలంలో నాటుకునేందుకు ఎనిమిది వేల నారు మొక్కలు అవసరం అవుతాయి. అంటే సుమారు 170 ట్రేలలో కణుపు నాటి నారు పెంచాల్సి వుంటుంది.




కట్టర్‌తో వేరు చేస్తున్న చెరకు కణుపులు


చెరకు గడల నుంచి కత్తిరించిన కణుపులు


చెరకు కణుపుల విత్తన శుద్ధి


గోనె సంచిలో 48 గంటలు ఉంచిన తరువాత కణుపుల వద్ద వచ్చిన మొలకలు

చెరకు నారు నాటే విధానం

ట్రేలలో చెరకు నారు పెరుగుతున్నప్పుడే పొలాన్ని బాగా కలియదున్ని ఎత్తుపల్లాలు లేకుండా చదును చేయాలి. జంట చాళ్లను రూపొందించాలి. అంటే చాలుకు చాలుకు మధ్య 60 సెం.మీ.లు, జంటకు జంటకు మధ్య 120 సెం.మీ.లు, లోతు 20 సెం.మీ.లు ఉండాలి. వరుసల మధ్య 120 సెం.మీ.లు, మొక్కల మధ్య 45 సెం.మీ.లు ఉండేలా నారును నాటుకోవాలి. జంట చాళ్ల విధానం వల్ల టిల్లర్‌తో అంతరకృషి చేసుకోవచ్చు. నారు నాటేందుకు ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది మంది కూలీలు అవసరం. నాటేటప్పుడు ఎకరానికి టన్నున్నర పశువుల గెత్తం, 120 కిలోల డీఏపీ ఎరువును మొక్కలకు దగ్గర వేసి మట్టితో కప్పాలి. ఈ సమయంలో నీటి తడి తప్పనిసరిగా ఇవ్వాలి. నారు మొక్కలను నాటిన తరువాత మూడు లేదా నాలుగు రోజులకు ఒకసారి పలుచగా నీటి తడులు ఇవ్వాలి. నారు మొక్కలు నిలదొక్కుకున్న తరువాత వారానికి ఒకసారి నీరు పెట్టాలి. ఒంటి కన్ను నారు మొక్కల సాంకేతిక పరిజ్ఞానం దిగుబడుల పెరుగుదలకేకాక చెరకు పిలకలు ఏకకాలంలో రావడం, పంట అంతా ఒకేసారి కోతకు రావడంతోపాటు కొత్త రకాలను త్వరితగతిన వ్యాప్తి చేయడానికి కూడా సాయపడుతుంది.


కణుపులను ట్రేలలో అమర్చుతున్న కూలీలు


చెరకు కణుపులపై మట్టిని నింపుతున్న కూలీలు


చెట్ల నీడలో అమర్చిన ట్రేలు


వారం రోజుల తరువాత..


నెల రోజుల తరువాత పొలంలో నాటేందుకు సిద్ధమైన చెరకు కణుపు నారు

నెగ్గుతుందా? వీగుతుందా?

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలిసి 26 మంది సభ్యులు ఉన్నారు. చైర్‌పర్సన్ రమాకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మంది అంటే.. 17 మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయాలి. ఇంతకన్నా ఒక్కరు తక్కువైనా సరే అవిశ్వాస తీర్మానం వీగిపోతుంది. ప్రత్యేక సమావేశం నిర్వహించాలంటే కోరం (2/3 మంది హాజరు కావాలి) వుండాలి. అవిశ్వాస తీర్మానం నోటీసుపై 19 మంది సంతకాలు చేసినప్పటికీ వీరిలో దాదాపు సగం మంది వెనక్కు తగ్గినట్టు తెలిసింది. వీరిలో కొంతమందిని తమ వైపునకు తిప్పుకుని, అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా చేయడానికి చైర్‌పర్సన్ వర్గీయులు చాపకింద నీరులా చేసిన ప్రయత్నాలు ఫలించినట్టు చెబుతున్నారు. అయితే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని నోటీసు ఇచ్చిన వైస్‌చైర్మన్లు, ఇతర సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలతో పట్టణంలో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది.

కళ తప్పిన డెమో స్కూల్

... 5వ పేజీ తరువాయి



మునగపాకలో ప్రాథమిక పాఠశాల

తరగతిలో 10 మంది విద్యార్థులు వున్నారు. మొత్తం తొమ్మిది తరగతి గదులకుగాను మూడు గదులే వినియోగంలో వున్నాయి. ఆరు గదులకు తాళాలు వేశారు. ఇప్పుడు రెండో తరగతిలో వున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరంలో ఉన్నత పాఠశాలకు వెళ్లిపోవాలి. ఒకటో తరగతిలో వున్న ముగ్గురు రెండో తరగతిలోకి వస్తారు. ఒక కొత్తగా ఒకటో తరగతిలో ఎంత మంది చేరతారో తెలియని పరిస్థితి. మొత్తం మీద ఒకప్పుడు 350 మంది విద్యార్థులు వున్న ఈ పాఠశాలలో ఇప్పుడు పట్టుమని పది మంది కూడా లేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం అనాలోచితంగా అమలు చేసిన నూతన విద్యా విధానమే కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పూర్వ వైభవంపై ఆశలు

ప్రస్తుత ప్రభుత్వం మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో ప్రాథమిక విద్యను ప్రక్షాళన చేయనున్నదని హెచ్.ఎం కె.వి.రమణమ్మ తెలిపారు. ఇందులో భాగంగా తమ పాఠశాలలో 3, 4, 5 తరగతులు పునరుద్ధరణ అయ్యే అవకాశం వుందన్నారు. దీంతో పూర్వవైభవం వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా విజేతలకు బహుమతులు





ద్వితీయ బహుమతి గ్రహీత బి.గోవింద్‌సింగ్‌కు రిఫ్రిజిరేటర్‌ను, తృతీయ బహుమతి గ్రహీత బి.శివసుందర్‌రావుకు ఎల్ఈడీ టీవీని అందజేస్తున్న 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు. చిత్రంలో సర్క్యులేషన్ విభాగం డీసీఎం సత్యనారాయణ, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాఠకుల కోసం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'కార్ అండ్ బైక్ రేస్' లక్కీ డ్రా (విశాఖపట్నం యూనిట్ స్థాయి)లో ద్వితీయ బహుమతి పొందిన కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన బి.గోవింద్‌సింగ్‌కు రిఫ్రిజిరేటర్‌ను సోమవారం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు అందజేశారు. అలాగే తృతీయ బహుమతి సాధించిన ఎంవీపీ కాలనీకి చెందిన బి.శివసుందర్‌రావుకు ఎల్ఈడీ టీవీని అందించారు. విజేతలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ విభాగం డీసీఎం బీఏవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ జాహ్నవి
- ప్రజల నుంచి 320 వినతులు స్వీకరణ


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీతోపాటు, డీఆర్ఓ సత్యనారాయణరావు, ఎస్‌డీసీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ, అర్జీల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించడానికి అధికారులు సంబంధిత అర్జీదారులతో స్వయంగా మాట్లాడాలన్నారు. చట్టపరంగా అభ్యంతరాలు లేని అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కరించడానికి వీలుకాకపోతే కారణం ఏమిటో తెలియపరచాలని సూచించారు. అంతకుముందు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. పీజీఆర్ఎస్ ముగిసే సరికి 320 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీవో జి.రామారావు, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీదారుల నుంచి స్వయంగా వినతులు స్వీకరించారు. వారి సమస్యను ఆలకించి, పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. పీజీఆర్ఎస్‌కు 45 అర్జీలు అందగా వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించినవి అధికంగా వున్నట్టు జిల్లా పోలీస్ కార్యాలయ ఎస్ఐ జి.వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(క్రైమ్) ఎల్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భళా ఈపీడీసీఎల్!

... 5వ పేజీ తరువాయి

అంతస్థుల భవనాన్ని విశాఖ సాగర్ నగర్‌లో నిర్మించింది. దీనికి నాలుగు ప్రమాణాలు పాటించింది.

ఇవీ ప్రత్యేకతలు

- భవన నిర్మాణానికి కేవిట్ వాల్స్ నిర్మించారు. ఇందుకోసం సిమెంట్ ఇటుకలను పోలి ఉండే ఆటోక్లేవ్డ్ ఏరియేటెడ్ కాంక్రీట్ (ఏసీసీ) ఇటుకలు ఉపయోగించారు. కేవిటీ వాల్స్ మధ్య వేడిని నియంత్రించడానికి ఊలు, థర్మోకోల్ వాడారు. దీని వల్ల బయట వేడి లోపలకు రావడం చాలా వరకు తగ్గిపోతుంది.
- పైకప్పు నుంచి వేడి కిందికి రాకుండా డబుల్ సీలింగ్ వేసి, సిల్వర్ ఫాయిల్‌తో పైకప్పును మూయించారు. ఇది కూడా వేడిని, విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తుంది.
- గోడలు, కిటికీలను నిర్దేశిత నిష్పత్తి ప్రకారం నిర్మించారు. కిటికీలకు డబుల్ గ్లేజ్డ్ అద్దాలు వాడారు. ఇది పూర్తి వెలుతురు అందిస్తూ వేడిని నియంత్రిస్తుంది.
- అన్ని భవనాల్లో ఎన్ని ఏసీలు ఉంటే బయట వాటికి అన్ని అవుట్ డోర్ యూనిట్లు ఉంటాయి. కానీ ఇక్కడ ఒకే ఒక్క అవుట్ డోర్ యూనిట్ ఏర్పాటుచేసి, దానికే అన్ని ఏసీలను అనుసంధానించారు. అంతే కాకుండా లోపల ఉన్న వారికి తగినట్టుగా ఆ గది ఉష్ణోగ్రతకు తగ్గట్టుగా మార్పులు చేసుకునేలా ఏర్పాటు చేశారు. ఇలా చేయడం వల్ల భవనం వినియోగంలో 50 శాతం విద్యుత్ ఆదా అవుతోంది.

లీజుకు రెండు అంతస్థులు

ఎకరాన్నర విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే శిక్షణకు ఉపయోగించుకోవాలని, మిగిలిన పై రెండు అంతస్థులు అద్దెకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. 'లెమన్ ట్రీ' సంస్థ స్టార్ హోటల్ నిర్వహణకు ముందుకువచ్చింది. చదరపు అడుగు లెక్కన అద్దె కోట్ చేసింది. దాని ద్వారా మంచి ఆదాయమే వస్తుందని నిర్ణయించుకున్న అధికారులు ఆ సంస్థకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే...గ్రౌండ్ ఫ్లోర్ నిర్వహణకు అయ్యే వ్యయం కూడా లీజుదారులే భరించడానికి ముందుకువచ్చారు. ఫలితంగా ఈపీడీసీఎల్‌కు నిర్వహణ వ్యయం (సిబ్బంది తప్ప) తప్పింది.

క్రైం... crime news

25 కిలోల గంజాయి స్వాధీనం: నలుగురి అరెస్టు

రోలుగుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశామని సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని దిబ్బలపాలెం గ్రామానికి చెందిన చవ్వాకుల చినమ్మలు ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి, చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో తన ఇంటి వద్ద అమ్ముతున్నది. జె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన వడ్డాదిసాయి, బంగారు పవన్‌ల సహాయంతో మద్దిగరువు ప్రాంతానికి వెళ్లి తగ్గుపాడు గ్రామానికి చెందిన కిలో తిమోతి వద్ద 25 కిలోల గంజాయి కొనుగోలు చేసి రెండు ద్విచక్ర వాహనాలపై తిరిగి వస్తున్నారు. కొంతలం జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీ చేసి గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న వీరితోపాటు విక్రయించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

చీడికాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం శివారు గుడివాడ బ్రిడ్జి వద్ద 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఓ బాలుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ బి.సతీశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ముందస్తు సమాచారం మేరకు గుడివాడ వంతెన వద్ద సోమవారం మధ్యాహ్నం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన ఓ యువకుడు, అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలుడు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. పోలీసులను చూసి యువకుడు పరారీ కాగా, బాలుడిని పోలీసులు పట్టుకున్నారు. ద్విచక్ర వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకుని బాలుడిపై కేసు నమోదు చేశారు.

మట్టవానిపాలెంలో ఇరువర్గాల మధ్య కొట్లాట

రావికమతం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మట్టవానిపాలెంలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగి మధ్యవర్తిగా వ్యవహరించిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తలారి ముసిలిబాబు కుటుంబీకుల మధ్య ఆస్తి పంపకాల విషయమై వివాదం జరుగుతోంది. దీనికి తలారి చిన్నారావు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారు. దీంతో మరో వర్గం వారు చిన్నారావుపై కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో పశువుల పాక వద్ద కుడితి బకెట్ కోసమై చిన్నారావు, మలిశెట్ల గౌరీ కుటుంబాల మధ్య ఆదివారం వివాదం చోటుచేసుకుంది. దీంతో మలిశెట్ల గౌరీ కుటుంబానికి చెందిన వెంకటేశ్, తదితరులు తలారి చిన్నారావుతో కొట్లాటకు దిగారు. దీంతో చిన్నారావు ఛాతీ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన 13 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కలపతో సహా రెండు ట్రాక్టర్లు సీజ్

రావికమతం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు కల్యాణపులోవ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని అటవీ శాఖ అధికారులకు అప్పగించామని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కల్యాణపులోవ అటవీ ప్రాంతం నుంచి కొంత కాలంగా అటవీ కలపను అక్రమంగా తరలిస్తుండగా అక్కడి గిరిజనులు పట్టుకొని సమాచారం అందించడంతో సోమవారం పోలీస్ సిబ్బందితో వెళ్లి కలప తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. కలప తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు ఆర్.కొత్తూరుకు చెందినవిగా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. తదుపరి చర్యలు కోసం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కశింకోట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కశింకోట జంక్షన్‌లో రెండు లారీలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న సంఘటనలో ఒక లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలమంచిలి వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న లారీని, వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొన్నది. దీంతో వెనుక లారీ డ్రైవర్ ముత్తుస్వామి క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సుమారు రెండు గంటలపాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ క్యాన్‌తో ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అడ్డుకున్న పోలీసులు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గవరపాలేనికి చెందిన బుద్ధ శ్రీనివాసరావు అనే రైతు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఒంటి మీద పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే వున్న పోలీసులు వెంటనే నిలువరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనకున్న ఎనిమిది సెంట్ల భూమిని కుటుంబీకులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని తెలిపారు. కాగా అక్కడ వున్న పోలీసులు ఇతని తెలుసుకొని రెవెన్యూ అధికారులకు తెలియజేయగా కలెక్టరేట్ విభాగం డీటీ వచ్చి, బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని డీటీ హామీ ఇచ్చారు. అనంతరం పోలీసులు శ్రీనివాసరావుకు నచ్చజెప్పి ఇంటికి పంపించేశారు.

27 నుంచి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో జరిగే వార్షిక ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 27 నుంచి మే 2వ తేదీ వరకూ ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈఓ కె. సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 27న గంధం అమావాస్య, 28 నుంచి మే 2 వరకు రామానుజాచార్యుల తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశామన్నారు.

26, 29 తేదీల్లో విశాఖకు సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 26న ఒకసారి, 29న మరొకసారి నగరానికి రానున్నారు. 26వ తేదీన ఆయన విశాఖపట్నం వచ్చి, హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా వెళతారు. అక్కడ 'మత్స్యకార భరోసా' పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. లబ్ధిదారులకు చెక్‌లు అందజేస్తారు. కార్యక్రమం ముగిసిన తరువాత తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడ నుంచి విజయవాడ వెళతారు. అలాగే ఈనెల 29వ తేదీ రాత్రి సతీసమేతంగా సీఎం నగరానికి రానున్నారు. ఈనెల 30వ తేదీన సింహాచలం వరాహనరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

చినకలవలాపల్లిలో వడ్డీ వ్యాపారి హత్య

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నరసింగరావు, ఎస్ఐ నాగేంద్ర, సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. తాతారావు మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను, ఇరుగుపొరుగు వారిని వాకబు చేశారు. తరువాత పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ వచ్చి పలు ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఆదివారం రాత్రి తన ఇంటి మేడపై పడుకొన్న తాతారావుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడన్నారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం తాతారావుది హత్యగా భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. తాతారావు కుమారుడు జల్లి అప్పలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429